

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

మే, 2023



త్రిభాషామహాసహస్రావధాని, ప్రణవపీఠాధిపతి
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్



త్వమస్మిన్ కార్య నిర్యోగే ప్రమాణం హరిసత్తమా
హనుమన్ యత్నమాస్థాయ దుఃఖ క్షయ కరో భవ

# ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవ పీఠం వారి అంతర్జాల ఆధ్యాత్మిక మాస పత్రిక

ఏలూరు

మే, 2023

సంపుటి-2
సంచిక-5


## విషయ సూచిక



| పేజీ | శీర్షిక | రచయిత |
|---|---|---|
| 01 | సంపాదకీయం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 02 | శ్రీ గణేశ పురాణం | శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య |
| 05 | శ్రీ వేంకటేశ్వర రహస్యం | శ్రీమతి నిడుముక్కల శ్రీకరి |
| 06 | పురాణంలో మహిళలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 08 | ఐశ్వర్యయోగం | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 09 | ఋషిచరిత్ర | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 10 | కాశీ కథలు | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |
| 13 | స్తోత్రమాలిక | బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ |
| 14 | గురుదేవుల జీవన కవనము | శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం |


శ్రీ మహాగణాధిపతయే నమః                శ్రీ గురుభ్యోనమః                శ్రీ మాత్రేనమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

**https://srivaddipartipadmakar.org**


© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.


శివ లీలలు అనంతం.ఈశ్వరానుగ్రహము కొఱకే శివగణములు,దేవతలు,మానవు లు, రాక్షసులు, జంతువులు నిరంతరం తపిస్తూ ఉంటారు.కలియుగంలో జీవులు తరించడానికి సరళమైన భాషలో శివ పురాణమును పూజ్యగురుదేవులు భక్తులకు అందించారు.శివలీలామృతమును భక్తితో తెలుసుకొని తరిద్దాం

పూజ్య గురుదేవులు అందించిన పుస్తకముల కొఱకు:

https://shop.srivaddipartipadmakar.org


శ్రీ ప్రణవపీఠం
सत्यं वद - धर्मं चर
ఏలూరు

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# సంపాదకీయం

## భక్తి మార్గం



ఆధ్యాత్మిక సాధనలో భక్తిమార్గానికి ఉన్న ప్రాముఖ్యము నిరుపమానమైనది. కలికాలంలో భగవన్నామకీర్తనమే సులభాతిసులభమైన తరణోపాయంగా చెప్పబడింది. హరినామసంకీర్తన కలి దోషాలను తొలగించే సులభోపాయము. 'యత్కీర్తనం భగవతో గుణకర్మనామ్నామ్' భగవంతుని గుణకర్మ నామాలను కీర్తించటం వల్ల సకల పాపాలు పటాపంచలైపోతాయని భాగవతంలో వ్యాసులవారు తెలియజేసారు. శ్రుతులు, స్మృతులు, పురాణాలు ఏకకంఠంతో భగవన్నామ సంకీర్తనను వర్ణించాయి. మానవుడు సర్వకాలసర్వావస్థల యందు భగవన్నామాన్ని జపించటం చాలా అవసరం. దానికి అవసరమైనవి శ్రద్ధాసక్తులు మాత్రమే.


ఆధ్యాత్మికోన్నతికి మనశ్శాంతికి మూలం భగవద్దర్శనం. ప్రారబ్ధకర్మ దుష్ఫలితాలు కూడా భక్తి వలన పటాపంచలైపోతాయి కనుక అందరికీ సులభ సాధ్యమైనది భక్తి మార్గం. నిశ్చల మనసుతో దైవధ్యానం చేసే వారికి సత్ఫలితాలు తప్పక లభిస్తాయి. "నిశ్చలతత్త్వేజీవన్ముక్తిః" అని భజగోవిందం లో శ్రీ శంకరాచార్యుల వారు సదా భగవన్నామస్మరణ చేసే వారికి ఇతర సాధనలు అవసరం లేదు అని కూడా తెలియజేసారు. మానవులందరూ వివేకులై తమను తాము ఉద్ధరించుకోవడానికి ప్రయత్నించటమే పరమ కర్తవ్యం అని గురువుల మాట కనుక ముక్తి కోరేవారు, అహంకార గర్వాలను విడిచిపెట్టాలి. మనస్సును భగవంతునిపై లగ్నం చేసి ధ్యానం చేయాలి. అప్పుడే దైవదర్శనం తప్పక జరుగుతుంది. అప్పుడే మానవుడు మాధవుడు అవుతాడు. దేవుడు అవుతాడు. భక్త ప్రహ్లాదుడు, మీరాబాయి, తులసీదాస్ వంటి మహాత్ములు ఎందరో తమ అనన్య భక్తి చేత దైవసాక్షాత్కార భాగ్యాన్ని పొంది ధన్యులయ్యారు. భగవన్నామస్మరణ వల్ల కవులు కావ్యాలు రచించగలిగారు.

దుర్లభమైన మానవ జన్మ ఎత్తి, ఈ జన్మలో భగవంతుని తెలుసుకోలేకపోతే ఆ జన్మకి సార్ధకత్వం లేదు.

కనుక మనమందరం కూడా ఈ కలియుగంలో అతి సులభమైనటువంటి భక్తిమార్గంలో నడచి భగవన్నామాన్ని చేపట్టి దైవ కృప పొందడం చాలా అవసరం. ఎంతో పూర్వజన్మ సుకృతం ఉంటే గాని ఈ మానవ జన్మ లభించదు. ఇటువంటి పవిత్రమైన జన్మను భక్తిజ్ఞానవైరాగ్యాల సంపాదనలో ఉపయోగించి జీవితాన్ని ధన్యం చేసుకోవాలి. అవివేకంతో వ్యర్థపరచకూడదు. మానవుడు నిరంతర భక్తివిశ్వాసాలతో చిత్తశుద్ధి కలిగి ఆత్మజ్ఞానాన్ని పొందితే భగవద్దర్శనం దొరుకుతుంది. కాబట్టి పరమ భక్తులైనటువంటి వారికి భగవంతుని మెప్పించి ఆయన కృపను పొంది తరించే అవకాశం కలుగుతుంది. దానికై ప్రణవ పీఠశిష్యులు భగనవన్నామాన్ని జపించి, తరించాలనీ అనేక మంగళాశాసనాలు చేస్తున్నాను ..



# శ్రీ గణేశ పురాణం



## బ్రహ్మవైవర్త పురాణంలో గణేశోత్పత్తి కథ

అష్టవిధ మైథున మనగా:

(1) స్త్రీ పురుషులు దాంపత్య జీవితాన్ని మాట వరసకు కూడా స్మరించుకోరాదు.

(2) రతిక్రీడలను పొగడరాదు.

(3) దంపతులు ఒకరితో ఒకరు ఏ విధమైన క్రీడలు నిర్వహించుకోరాదు.

(4) ఒకరినొకరు కామదృష్టితో చూచుకోరాదు.

(5) సరస సంభాషణలు, రహస్య సంభాషణలు చేయరాదు.

(6) రతిక్రీడలు జరపాలన్న సంకల్పం మనస్సులోనికి రానీయకూడదు.

(7) పదే పదే వ్రతం తొందరగా పూర్తి అయి రతిలో పాల్గొనాలనే ఆలోచన మనస్సులోనికి రానీయకూడదు.

(8) క్రియా నిష్పత్తి — అనగా ఇంద్రియాలను అదుపులో పెట్టుకొన లేక స్త్రీ పురుష సంభోగం జరుపరాదు.

ఈ విధంగా వ్రతాన్ని శ్రద్ధగా, నియమబద్ధంగా నిర్వహించి వ్రతోద్యాపన చేయాలి. వ్రతోద్యాపన సమయంలో విప్రోత్తములకు గోధుమ పిండితో చేసిన

మూడు వందల అరవై అపూపాలు (అప్పాలు), భోజన పదార్థాలు, యజ్ఞోపవీతం పళ్ళెములలో ఉంచి, పైన చక్కని కొత్త వస్త్రం కప్పి దానం చేయాలి. . తన శక్తిని అనుసరించి విప్రులకు అన్నదానం చేయాలి. మహాసంపదలున్నవారు 1,360 మందికి అన్నదానం చేయాలి. అగ్నిహోత్రునికి 1360 ఆహుతులు ఆవు నేతితో సమర్పించాలి. దక్షిణ ఇవ్వని వ్రతాలు వ్యర్థాలు కనుక యథాశక్తి దక్షిణ సమర్పించాలి. శక్తి లేనివారు తమకున్న దానిలో దానధర్మాలు చేయాలి తప్ప అప్పులు చేసి, వ్రతాలు చేసి ముప్పులు తెచ్చుకోరాదు. భగవంతునికి శ్రద్ధాసక్తిభక్తులు ముఖ్యం. ఆడంబరం కాదు. ఈ వ్రతాన్ని అచంచలమైన, దృఢమైన భక్తితో చేసిన వారికి శ్రీమహావిష్ణువుపై అంతకంతకు భక్తి పెరుగుతుంది. భక్తి పెరిగితే శ్రీహరి వ్రతం చేసిన వారిలో తన దివ్యశక్తిని నింపుతాడు. ఆ శక్తి ప్రభావం వల్ల వ్రతం చేసిన వారికి సత్పుత్ర సంతానం కలుగుతుంది. పుట్టిన పుత్రుడు జగత్ప్రఖ్యాతి పొందుతాడు. సౌందర్యమూర్తి అవుతాడు. వ్రతం చేసినవారు కూడా సుందరులు అవుతారు. సుందరుడు అనగా జనాకర్షణ కలిగిన వాడు అని అర్థం. సుతరాం అద్రియత ఇతి సుందరః — దృఙ్ ఆదరే అని సుందర శబ్దానికి నిర్వచనం. మిక్కిలి సంతోషపెట్టువాడు, లేదా చూచే వారికి ఇంకా ఇంకా చూడాలి అని ఆకర్షణ కలిగించే వాడు అని ఈ శబ్దార్థం. మనిషిలోని కొన్ని నిగూఢ శక్తుల వల్ల అతని రూపం చూడగానే జనులు అతనికి వశులౌతారు. ఈ వ్రతం అటువంటి శక్తులను ఇస్తుంది. స్త్రీలకు సౌభాగ్యం కూడా లభిస్తుంది. ఈ వ్రతం చేసినవారి కుటుంబంలో దారిద్ర్యం ఉండదు. పదవులు, ధనాలు లభిస్తాయి. ఈ వ్రతం చేసుకొన్నవారు ఈ జన్మలోనే కాక, రాబోయే జన్మలలో కూడా కోరిన కోర్కెలు తీర్చుకోగల్గుతారు. పరమ శంకరుడు పార్వతీదేవికి ఈ విధంగా పుణ్యక వ్రతాన్ని, ఆ వ్రతాన్ని ఆచరించడం వల్ల వచ్చే ఫలితాలను తెలియజేసి, ఆమెనా వ్రతం ఆచరించమన్నాడు. అనంతరం తన భక్తులైన కొందరు మునులను అనుగ్రహించడానికి సంకల్పించుకొన్న శివుడు మరల పార్వతితో ఇలా అన్నాడు — భవానీ! నువ్వు చేయబోయే పుణ్యక వ్రతానికి పువ్వులు, పండ్లు అవసరం. నా ఏకాంత భక్తులైన కొందరు విప్రఋషులు నీకు వాటిని తీసికొని వచ్చి అందజేస్తారు. ఒకప్పుడు నూరుగురు మునులు తమ తపస్సుతో నన్ను మెప్పించారు. వారి తపస్సునకు మెచ్చి నేను వారికి ప్రత్యక్షమై ఏమి వరం కావాలో కోరుకొమ్మన్నాను. అప్పుడు వారు మీ ఆదిదంపతులకు ఏదో ఒక సమయంలో ప్రత్యక్ష సేవ చేసే భాగ్యం ప్రసాదించమన్నారు. నేను వారికి సరేనని మాట ఇచ్చాను. ఇప్పుడామాట నిలబెట్టుకోవాలి. కనుక ఆ మునులను నీ సేవ చేసే భాగ్యంతో అనుగ్రహించు. ఒకప్పుడు కొంతమంది కిరాతకులు వింధ్యారణ్యంలో తమ భక్తితో నన్ను ప్రసన్నుడిని చేసుకొన్నారు. వారిని ఇప్పుడు కైలాసంలో నా దూతలుగా చేసుకొన్నాను. ఆ నూరుగురిని ఈ వ్రతకాలంలో నీకు సేవకులుగా నియోగిస్తాను. సమస్త వ్రత విధానములు ఎరిగినటువంటి వారిని, వేద వేదాంగాలలో ఆరితేరినటువంటి వారిని, మహాత్ములైన హరిభక్తులైనటువంటి వారిని ఈ వ్రతానికి పిలవాలని నేనొకప్పుడు నియమం చేసాను. అందువల్ల పై లక్షణాలన్నీ ఉన్న సనత్కుమారుడిని నీకు పురోహితుడిగా నియమిస్తున్నాను. ఈ వ్రతాన్ని నీవెలాగూ నిస్సందేహంగా శ్రద్ధాభక్తులతో చేస్తావు. ఆ వ్రత ప్రభావంతో నీకు మహాత్ముడైన పుత్రుడు జన్మించి లోక పూజ్యుడవుతాడు.

సకల పాపాలను, తాపాలను, శాపాలను తొలగించే జగన్మాత, హిమశైలసుత, సకలమునిజనగణ సంపూజిత, పార్వతీభగవతి, పతి మాటలు మతిలో ఉంచింది. భర్త అనుజ్ఞ తీసుకొన్నది. పుణ్యక వ్రతాన్ని ఆరంభించింది. బ్రహ్మమానసపుత్రుడు సనత్కుమారుడు పురోహితుడై పార్వతి చేత ఈ వ్రతానుష్ఠానం చేయించాడు. వ్రత పర్యవేక్షణకు సరస్వతీసమేతుడై బ్రహ్మదేవుడు వేంచేసాడు. పార్వతీసన్నిధానంలో సకలలోకేశ్వరుడు మహేశ్వరుడు కూడా కూర్చున్నాడు. ఆ వ్రతానికి అధిష్ఠాన దేవతమైన శ్రీమహావిష్ణువు

నీలమేఘచ్ఛాయాశరీరంతో, చతుర్భుజుడై వనమాలను ధరించి, సర్వాభరణభూషితుడై శ్రీమహాలక్ష్మితో పార్షదులతో అచటకు వేంచేసి సమున్నతాసనంపై కూర్చున్నాడు. సనకుడు, సనందనుడు, సనాతనుడు(సనత్సుజాతుడు), కపిలమహర్షి, ధర్మదేవతాపుత్రులైన నరనారాయణులు, కౌండిన్యుడు, అత్రి, మరీచి, దక్షుడు, అగస్త్యుడు, అక్షపాదుడు, అంగిరుడు,శాండిల్యుడు, క్రతువు, కణ్వుడు, కుత్సుడు, భృగువు, విశ్వామిత్రుడు, మైత్రేయుడు, మార్కండేయుడు, ఆసురి, వామదేవుడు, కపి, దుర్వాసుడు, బకుడు, వ్యాఘ్రపాదుడు, మాండవ్యుడు మున్నగు మహాత్ములు, ప్రసిద్ధులైన మునులు తమ తమ శిష్యులతో వ్రతం చూడడానికి విచ్చేసారు. ఉమాదేవి చేస్తున్న ఈ వ్రతం కళ్ళారా చూసి, తరించాలనే కోరికతో దిక్పాలకులు, సురసిద్ధసాధ్యనరకిన్నరపన్నగయక్షచారణాసురవిద్యాధర గంధర్వ జాతులవారంతా అమ్మవారి సన్నిధికి వేంచేసారు. పర్వతరాజు హిమవంతుడు పుత్రికపై గల ప్రీతితో అనేక రత్నాభరణాలు, వివిధ వ్రతసామాగ్రి పంపించాడు. అక్కడితో తృప్తి వహించక శ్రేష్ఠములైన ఒక లక్ష ఏనుగులను, మూడు లక్షల గుఱ్ఱాలను, పదిలక్షల గోవులను, ఒక కోటి బంగారు ముద్రలను, నాల్గులక్షల ముత్యాలను ఒక వేయి కౌస్తుభమణులను, ఒక లక్ష బండ్ల మీద వివిధములైన తినుబండారములను పంపించాడు. ఈ విషయం తెలిసిన సన్యాసులు, భిక్షుకులు, వందిగణాలు కూడా వ్రతదర్శనానికి విచ్చేసారు. ఆ సమయంలో కైలాసపర్వతం వస్తువులతో, విచ్చేసిన మహాత్ములతో శోభిల్లింది. రాజమార్గాలలో గంధం కలిపిన నీళ్ళతో కళ్ళాపు చల్లారు. పద్మరాగ మణులతో నిర్మింపబడిన పార్వతీపరమేశ్వరుల ఇంటి చుట్టూ మామిడితోరణాలు కట్టారు. ఇంటి ముందు అరటి స్తంభాలు కూడా పాతారు. శివాశివుల మందిరం లేత గరికపోచల తోటి, వివిధ ధాన్యాలతోటి, ఫలపుష్పాలతోటి, కందమూలాలతోటి అలంకరింపబడింది. ఆ మందిర శోభను చూసి సకల జనులు ఆశ్చర్యపోయారు. ఆనందంతో ప్రమథగణాలు నృత్యం చేసారు. పాటలు పాడారు. స్వయంగా శివుడు వచ్చిన వారందరికీ అతిథిమర్యాదలు జరిపించాడు. శివుడు తమకు సత్కారాలు చేయడం చూచిన సకల జనులూ ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆనందంతో మురిసిపోయారు. పుణ్యక వ్రతం పార్వతీమాత చేస్తున్నకాలంలో దేవేంద్రుడు దానాలకు అధ్యక్షస్థానం వహించి, దానాలు సక్రమంగా జరిపించాడు. వరుణుడు భోజనశాలకు పర్యవేక్షకుడు అయ్యాడు. పెరుగు, పాలు, నేయి, బెల్లం, తేనె, నూనె, మజ్జిగ నదులవలె ప్రవహించాయి. అమృతం వంటి పదార్థాలు, మంచిమంచి ఆహారాలు, చక్కెర మొదలైనవి రాశులుగా కనపడ్డాయి. నేతిలో కలిపిన యవలు, గోధుమపిండి, స్వస్తికములనబడే(చేగోడీలు) పిండివంటలు, పూర్ణం బూరెలు, బెల్లం కలిపిన పేలాలు,అటుకులు, బియ్యాలు, పర్వతాలంత ఎత్తైన రాసులుగా దర్శనమిచ్చాయి. బంగారం, వెండి, పగడాలు రకరకాల మణులు కూడా పర్వతాలవలె రాశులుగా పేర్చబడి కనబడ్డాయి. పాయసం, పిండి వంటలు, అన్నాలు, నేతితో వండిన వివిధములైన కూరగాయలు స్వయంగా లక్ష్మీదేవి వండగా, శివుడు, విష్ణువు, దేవతలు, మునులు, బ్రాహ్మణులు, సంతృప్తిగాభుజించారు. ఆహారాదులు అవసరం లేని దేవతలు, వ్రతం కోసం ఆహారాలు వండించి, స్వీకరించారు. వ్రతంలో అన్నదానమహిమను చాటడానికి తప్ప, లేకుంటే శివునికి, విష్ణువునకు ఆహారాలతో పనిఏమిటి? ఆ వ్రతంలో వడ్డన చేయడానికి లక్షమంది బ్రాహ్మణులు నియోగించబడ్డారంటే, ఇక భోజనం చేసిన వారు ఎంతమందో ఊహించనలవికాదు. భుజించిన వారందరికీ లోకమాత పార్వతి రత్నసింహాసనాలపై కూర్చోబెట్టి, పచ్చకర్పూరంతో కూడిన తాంబూలాలు ఇచ్చింది.

...ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

## వీరలక్ష్మీ రూపంలో శ్రీదేవి శుకాశ్రమంలో వెలసిన వృత్తాంతం



అమ్మవారు అప్పుడు ఇప్పుడు కూడా ఈ పద్మ సరస్సు నుండే వచ్చింది కనుక ఈ తీర్థాన్ని పద్మతీర్థం అని వ్యవహరిద్దాం. ఈ తీర్థంలో స్నానం చేసిన వారికి సకల దారిద్ర్యాలు తొలగిపోతాయి. సంపదలు లభిస్తాయి. అధైర్యం తొలగి ధైర్యం చేకూరుతుంది. కార్తికశుద్ధపంచమీ తిథిన ఈ సరస్సులో స్నానం చేసినా లేక ఈ సరస్తీర్థాన్ని త్రాగినా సకలపాపాల నుండి విముక్తి పొంది మానవులు జీవించినంతకాలం భోగభాగ్యాలు అనుభవించి హరికృపతో సద్గతులు పొందుతారు.

ఇలా పలికి బ్రహ్మ ముందుగా తాను ఆ తీర్థంలో స్నానం చేసి, అనంతరం తక్కిన దేవతలందరి చేతా స్నానాలు చేయించాడు. ఆ పద్మతీర్థానికి ఆగ్నేయభాగంలో విశ్వకర్మ ద్వారా దివ్యమైన మందిరనిర్మాణం చేయించాడు. వీరలక్ష్మిని ప్రార్థించి తీసుకొని వచ్చి ఆ ఆలయంలో కొలువై ఉండమని ప్రార్థించాడు. ఛాయాశుకుడిని పిలిపించి, సకల లాంఛనాలతో శాస్త్రోక్తంగా అమ్మవారిని ప్రతిష్ఠింపజేసి, సర్వోపచారాలు జరిపించాడు. అమ్మవారిని కామధేనువు పాలతో, మందాకినీజలాలతో అభిషేకించాడు. దేవతలందరూ అమ్మవారికి కానుకలు సమర్పించారు. శ్రీమహావిష్ణువు తన మెడలోని పుష్పహారం, వీరలక్ష్మి మెడలో వేసాడు. బ్రహ్మాదిదేవతలకు అద్భుతమైన విందుభోజనాలు ఏర్పాటు చేసాడు. అందరికీ వస్త్రాలు, చందనతాంబూలాలు సమర్పించాడు. దేవతలందరినీ యథాశక్తిగా సత్కరించాడు. అప్పుడు శుకుని పిలిచి, నీ ఆశ్రమం శుకాగ్రహారంగా మారుస్తున్నాను. ఇది కలియుగాంతం వరకు, ఛాయాశుకుడివైన నీ ఆధ్వర్యంలో ఉంటుంది, అని పలికి అతనికి అగ్రహారాన్ని అప్పగించాడు. అనంతరం శ్రీవేంకటేశ్వరుడు శ్రీవీరలక్ష్మితో ఇలా అన్నాడు

"శ్రీమహాలక్ష్మీ! వీరలక్ష్మీ! ఇది నీ తొలిరూపం. దీనిని చూడగానే నాకు బ్రహ్మానందం కలిగింది. ఇదే ఆనందం ఇక్కడికి వచ్చేవారికి ప్రసాదించు. శ్రీమహాలక్ష్మి తథాస్తు! అన్నది. అందుకే జీవితంలో ఒకసారైనా పద్మ తీర్థాన్ని దర్శించాలి. దర్శన యోగం లేనివారు ఈ కథను శ్రద్ధతో విన్నా, చదివినా, వ్రాసినా, వినిపించినా వీరలక్ష్మీ దేవతానుగ్రహాన్ని సంపూర్ణంగా పొందగలుగుతారు."

...ఇంకా ఉంది

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# పురాణం లో మహిళలు

## గాంధారీ



లోకంలో పేరుగాంచినటువంటి పతివ్రతలలో గాంధారి ఉన్నతశ్రేణికి చెందిన ఇల్లాలు. ఈమె గాంధార దేశపు రాజైన సుబలుని కుమార్తె మరియు శకునికి సోదరి. ఈమె తాను కుమారిగా ఉన్న సమయంలోనే పరమేశ్వరుని ఆరాధించి తనకు నూరుగురు కుమారులు కలిగేటట్లుగా పరమశివుని వల్ల వరం పొందింది. తన వివాహం ఒక పుట్టు గుడ్డివానితో జరగనున్నదని తెలిసినటువంటి ఆమె తన భర్త లోకాన్ని చూడని వాడైనప్పుడు తాను మాత్రం ఎందుకు చూడాలి అని అనుకొని తన కన్నులకు గంతలు కట్టుకొని గ్రుడ్డిదానిగా మారింది. నాటి నుండి ఆమె జీవితాంతం గ్రుడ్డిదానిగా ఉండిపోయినది. పతి కోసం ఈ విధంగా ఇంద్రియసుఖాలను పరిత్యజించిన ఉదాహరణ ప్రపంచ చరిత్రలో ఎక్కడ మరొకటి కనబడదు. ఈమె సర్వకాలసర్వావస్థలలో తన పతికి అనుకూలురాలై నడుచుకున్నది. గాంధారి యొక్క తపస్సు, త్యాగము నిరుపమానమైనది. లోకానికి ఆదర్శప్రాయమైనది. గాంధారిలో పతిభక్తితో పాటు నిర్భయత్వం, న్యాయప్రీతి వంటి లక్షణాలు కూడా ఉన్నాయి. ఆమె ఎప్పుడూ కూడా సత్యము, ధర్మము, నీతి ఏ పక్షాన ఉంటే ఆ పక్షాన్ని సమర్థించేది. అన్యాయాన్ని ఎప్పుడూ సమర్థించేది కాదు. తన తనయుడు ద్రౌపదిపై సాగించిన అత్యాచారాన్ని గూర్చి ఆమె ఎంతగానో మనస్తాపం చెందింది. ఈ విషయంలో ఆమె తన బిడ్డలను ఎప్పుడు కూడా సమర్థించలేదు. తన భర్త అయిన దృతరాష్ట్రమహారాజు తన కొడుకుల మాటలకు లోబడి పాండవులను జూదమాడటానికి పిలిపించిన సందర్భంలో కూడా ఆవిడ పరితపించింది. తన భర్తతో స్వామీ! దుర్యోధనుడు జన్మించిన వెంటనే నక్కలు రోదించిన నాడు మహా జ్ఞాని అయిన విదురుడు ఈ బిడ్డను వదిలివేయమని చెప్పాడు. బిడ్డ మీద ఉన్న వ్యామోహం కారణంగా ఆనాడు నేను దుర్యోధనుడిని విడిచిపెట్టలేక పోయాను. దాని ఫలితమే ఈ యుద్ధం. దుష్టులు, పరమమూర్ఖుల మాటలలో పడి మీరు వంశనాశనానికి కారణభూతులు కావద్దు. వైరానికి దూరంగా ఉండండి. పాండవులు శాంతస్వరూపులు. వారికి కోపం కలిగించడం మంచిది కాదు. ఈ విషయాలన్ని మీకు తెలియనివి కావు. అయినా మీకు గుర్తు చేస్తున్నాను. దుష్ట బుద్ధిగల పురుషుని చిత్తం శాస్త్రోపదేశాల చేత ప్రభావితం కాదు. కానీ మీరు వృద్ధులై ఉండి చిన్నపిల్లలలాగా మాట్లాడటం మంచిది కాదు. మీరు పాండవులపై

కన్నబిడ్డల వలె ఆత్మీయతను ప్రదర్శించండి. వారు దుఃఖితులై మీకు దూరం కాకుండా చూడండి. శాంతిమార్గాన్ని, ధర్మమార్గాన్ని, మంత్రుల సమ్మతిని అనుసరించి మీ ఆలోచనలను పవిత్రంగా ఉంచుకోండి. అనాలోచితంగా ప్రవర్తించవద్దు. అది మనకు దుఃఖకారణం అవుతుంది అని గాంధారి పలికింది. దుర్యోధనుడు, పాండవుల పట్ల అనుచితంగా ప్రవర్తించుట తగదని గాంధారి హెచ్చరిస్తూ ఉండేది. అతని యొక్క దుష్టతను నిరసించేది. అతడు చేసే పనుల వల్ల రాబోయే పరిణామాలను వివరించి అతనిని నిరోధించడానికి ప్రయత్నించేది. అయినా దుర్యోధనుని నెత్తిమీద కాలదేవత నృత్యం చేస్తూ ఉండటం చేత ఈ హితోక్తులు ఏవి అతని తలకి ఎక్కేవి కావు. పాండవుల పక్షాన సంధి చేయటానికి హస్తినాపురానికి రాయబారిగా వచ్చినటువంటి కృష్ణుడు కూడా దుర్యోధనునకు పలురకాలుగా నచ్చజెప్పి విసిగినప్పుడు కూడా ధృతరాష్ట్రుడు గాంధారిని పిలిచి ఆమెతో ఇక నీవే నీ కొడుకునకు నచ్చచెప్పుకో. వాడు మా మాటలను పెడచెవిన పెడుతున్నాడు అని అన్నాడు. భర్త మాటలు విన్న గాంధారి తన కొడుకుతో కాక భర్తతో ఇలా పలికింది- “ మహారాజా! మీరు పుత్రవ్యామోహానికి లోబడి ఉన్నారు కాబట్టే ఈ విషయంలో మీ దోషమే ఎక్కువ. దుర్యోధనుడు పాపి అని తెలిసి కూడా మీరు వారి బుద్ధినే అనుసరిస్తున్నారు. ఈ దుర్యోధనుడు మూర్ఖుడు, దురాత్ముడు దుష్టజనులతో సాంగత్యం కలవాడు. లోభగ్రస్తుడైన కొడుకు చేతులకు అనాలోచితంగా రాజ్యభారాన్ని అప్పగించి అనర్థం తెచ్చిపెట్టుకున్నారు.దాని ఫలితం అనుభవించక తప్పదు” అని పలికింది. తన కుమారుడైనటువంటి దుర్యోధనుడిని పిలిచి వానికి హితబోధ చేసింది. కుమారా! నా మాట విను. నీ తండ్రి, భీష్ముడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, విదురుడు నీకు ఏమి చెప్పినా దానిని నీవు స్వీకరించు అప్పుడు నువ్వు నీ హితం కోరుకునే అందరిని సేవించినవాడవవుతావు. కుమారా! రాజ్యాన్ని రక్షించటం, అనుభవించడం అనేది మన చేతిలో ఉండే అంశం కాదు. అంతః శత్రువులను జయించిన వాడే సమస్త భూమండలాన్ని జయించగలుగుతాడు. ఇంద్రియాలు ఎవరికి వశీభూతాలు అవుతాయో, ఎవరు ముందు వెనుకలు చక్కగా ఆలోచించి అన్ని పనులు చేస్తూ ఉంటాడో అతని దగ్గర సంపద చిరకాలం నిలకడగా ఉంటుంది. మీ తాతగారు భీష్ముడు, గురువు ద్రోణాచార్యుడు నీకు చెప్పిన మాట నిజం. వాస్తవంగా శ్రీకృష్ణుడిని కానీ, అర్జునుని కానీ ఎవరు జయించలేరు. కాబట్టి నీవు శ్రీకృష్ణుని శరణు పొందు. అతడు ప్రసన్నుడై ఇరుపక్షాలకు శుభం చేకూరుస్తాడు. నాయనా! నా మాట విను. యుద్ధం సాగించడంలో ప్రయోజనం లేదు. అందులో ధర్మము లేదు. అర్థము లేదు. ఇక సుఖం ఎలా ఉంటుంది? పాండవులకు దక్కవలసిన భాగాన్ని వారికి ఇచ్చివేసి లోకంలో గొప్ప పేరు తెచ్చుకో అని ఉపదేశం చేసింది గాంధారి. ఈ ఉపదేశం ఏ మాత్రం పనిచేయలేదు. దుర్యోధనుడు తన పంతాన్ని విడిచిపెట్టలేదు. దాని కారణంగా ఇరువైపుల నుండి యుద్ధసన్నాహాలు మొదలయ్యాయి. 18రోజుల పాటు కురుక్షేత్ర సంగ్రామం సాగిపోయింది. తన కుమారులు నూరుగురు యుద్ధంలో చనిపోయిన తర్వాత మాత్రం ఒక్కసారిగా తీవ్ర ఆగ్రహం కలిగింది. వేదవ్యాసభగవానుడు ఆమె మనోభావాలను ఎఱిగి ఆమె చెంతకు వచ్చి ఓదార్పు మాటలతో పాండవులను శపించాలన్న దుష్టసంకల్పాన్ని నిరోధించాడు. చివరగా ఆమె తన క్రోధాన్ని శ్రీకృష్ణుని మీదకు మరలించి ఇలా పలికింది- “ కృష్ణా! పాండవులు, కౌరవులు తమలోని అంతర్గత కలహం వల్లనే నష్టపోయారు. నీవు సమర్థుడై ఉండి కూడా నీ బంధువులను ఎందుకు చంపుకున్నావు. వారికి నచ్చచెప్పినట్లయితే బాగుండేది. కానీ నువ్వు అలా చేయలేదు. బుద్ధిపూర్వకంగానే కౌరవసంహారం పట్ల ఉపేక్షవహించావు . కాబట్టి దాని ఫలితాన్ని నీవు అనుభవించెదవు గాక. నేను పతిసేవ వల్ల కూడబెట్టుకున్న తపస్సు యొక్క బలంతో నిన్ను శపిస్తున్నాను. పరస్పరం యుద్ధం చేసుకొని నష్టపడుతున్న పాండవులను, కౌరవులను ఎలా ఉపేక్షించావో అలాగే నీవు నీ

సోదరులను, బంధువులను కూడా ఉపేక్షించి వారి మరణానికి కారణమౌవుతావు. వారివలె అనాధ అయిపోతావు. నీ కుటుంబానికి చెందిన స్త్రీలందరూ తమ మగవారు అందరూ మరణించాక నెత్తి మొత్తుకొని బోరుమని విలపించుదురని శపించింది. ధర్మరాజునకు పట్టాభిషేకం అయ్యాక గాంధారి కొంతకాలం అతని దగ్గరనే ఉండి చివరకు తన భర్తతో, కుంతితో కలిసి మునిజీవనవిధానాన్ని అవలంబించింది. తన శరీరాన్ని దావాగ్నిలో దగ్ధం కావించుకుని చివరకు తన భర్తతో పాటుగా కుబేరలోకాన్ని పొందింది. ఈ విధంగా గాంధారి ఇహలోకంలో ఉన్నంతకాలం పాతివ్రత్య ధర్మాన్ని పాటించి పరలోకంలో కూడా భర్త సాన్నిద్యాన్ని, అతని సేవా భాగ్యాన్ని పొందినది.

*****

# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః     శ్రీ మాత్రేనమః     శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 319. రామా – [ఓం ఐం హ్రీం శ్రీం రామాయై నమః]

రామా అనగా స్త్రీ. చక్కని యువతిగా దర్శనమిస్తుంది కనుక అమ్మను రామా అన్నారు. అమ్మను చూడగానే ఆనందించి, తమ హృదయాలను ఆమెకు సమర్పించి యోగులు బ్రహ్మానందం పొందుతారు. యోగులను కూడా రమింపజేస్తుంది కనుక అమ్మను రామ అన్నారు. పరాశరస్మృతి, పురాణాలు లోకంలోని స్త్రీలందరు అమ్మవారి స్వరూపాలనీ, పురుషులు అందరూ శివస్వరూపాలనీ చెపుతున్నాయి. సర్వజగత్తులలోని పవిత్ర స్త్రీ రూపాలలో ఉంటున్నది అమ్మవారే కనుక అమ్మను 'రామా' అన్నారు. సర్వకళలు, దివ్యశక్తులు, విభూతులు ఉన్న స్త్రీ ని 'రామా' అంటారు. అమ్మలో సర్వ మహిమలు ఉన్నాయి అని కూడా ఈ నామానికి మరొక అర్థం.

### మంత్రప్రయోగవిధానం – ఫలితం

శరీరం దుర్బలమై, సౌందర్యం లేక, అసహ్యంగా మారిపోయిన లేక మారుతున్నప్పుడు, శరీరాన్ని అందంగా, ఆరోగ్యంగా, బలంగా మార్చుకోవడానికి ఈ మంత్రాన్ని జపించమని అగస్త్యుడు చెప్పాడు. తులసీరసం, మారేడు ఆకులరసం కలిపి, దానిలో శుద్ధ గంగాజలం లేక నదీ జలం కలిపి (కొద్దిగా) అమ్మవారికి నివేదించి, ఈ మంత్రాన్ని 500 మారులు జపించి, అమ్మవారికి నివేదించిన రసం కొంత తీర్థంగా త్రాగి మిగిలినది శరీరావయవాలకు (వీలున్నంతవరకు) పూసుకోవాలి. 40 దినాలు ఇలా చేస్తే శరీరం చక్కగా తయారవుతుంది.

... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

*****

# ఋషి చరిత్ర

## కౌశికుడు శబలను కోరడము

శబలా సా రుదంతీ చ క్రోశంతీ చేదమబ్రవీత్

"నేనేమైనా లోపం చేశానా, నన్ను పరిత్యజిస్తున్నారు? మీరు నన్ను రక్షిస్తారా లేక నన్ను నేను రక్షించుకోమంటారా?" అని అడుగుతుంది. ఓ మహాత్మా! మీబ్రహ్మ బలము నన్ను పరిపుష్టము చేసినది.క్షత్రియబలము బలమే కాదు బ్రాహ్మణ బలమే శ్రేష్టము.మీరు ఆజ్ఞ ఇవ్వండి. ఆ క్షత్రియబలమును నేను నాశనము చేస్తాను అంటుంది. వశిష్ఠ మహర్షి దానికి అంగీకారాన్ని తెలుపుతాడు. అప్పుడు శబల ఒక హూంకారం చేసి, శూలాయుధులైన పప్లవులకు జన్మనిచ్చి వారి ద్వారా విశ్వామిత్రుడి సైన్యాన్ని నాశనం చేస్తుంది. అది చూసి క్రోధ పరవశుడైన విశ్వామిత్రుడు అనేక శస్త్రములతో పప్లవులను సంహరిస్తాడు. దానికి క్రుద్ధ అయిన శబల శకులను యవనులను సృష్టిస్తుంది.. విశ్వామిత్రుడు గొప్ప శక్తిగల అస్త్రములతో వారిని చెల్లాచెదరు చేస్తాడు.వశిష్ఠుని ఆజ్ఞతో తన హుంభావం నుండి కాంభోజ వంశీయులను, పొదుగు నుండి పప్లవులను, యోని స్థానం నుండి యవనులను, పురీషం నుండి శకులను, రోమకూపాలనుండి మ్లేచ్ఛులను హరీతులను, కిరాతకులను పుట్టించగా వారు విశ్వామిత్రుని సైన్యాన్ని పూర్తిగా నాశనం చేస్తారు. అది చూసిన విశ్వామిత్రుడి నూరుగురు కుమారులు వశిష్ఠమహర్షిని చంపేందుకు వెళ్తారు. వశిష్ఠ మహర్షి ఒక హుంకారం చేయడంతో నూరుగురు భస్మరాశులై పడిపోతారు. అది చూసిన విశ్వామిత్రుడు విచారించి, తన దగ్గర ఉన్న శక్తులతో వశిష్ఠుని గెలవజాలనని తెలిసి, రాజ్యానికి తిరిగి వెళ్ళి, మిగిలిన కుమారులలో ఒకరికిరాజ్యాన్ని అప్పగించి, హిమాలయాలకు వెళ్ళి ఉత్తరాన పరమశివుడికై తీవ్రమైన తపస్సు చేస్తాడు.

## పరమశివుడికై తపస్సు

విశ్వామిత్రుడి ఘోర తపస్సుకు మెచ్చి, శివుడు ప్రత్యక్షమై తన కోరికను వెల్లడించమంటాడు.

యది తుష్టో మహాదేవ ధనుర్వేదో మమానఘ |
సాంగోపాంగోపనిషదః సరహస్యః ప్రదీయతామ్ ||

మీరు నా తపస్సును మెచ్చితే సాంగోపాంగముగా ధనుర్విద్యను ఉపనిషద్రహస్యములను దేవ దానవ గంధర్వ యక్ష రాక్షసుల అస్త్ర పటిమను ఇమ్మని విశ్వామిత్రుడు కోరుతాడు. శివుడు తథాస్తు అని దీవిస్తాడు. ఆ వరాన్ని పొందిన వెంటనే విశ్వామిత్రుడు పౌర్ణమి నాడు సముద్రం పోటెత్తినట్లుగా ఉత్సాహంతో ఉప్పొంగి వశిష్ఠ మహర్షి ఆశ్రమానికి వెళ్తాడు.

## వశిష్ఠ విశ్వామిత్రుల యుద్ధం

వశిష్ఠుని ఆశ్రమంపై యుద్ధానికి వచ్చిన విశ్వామిత్రుడు తాను వరంగా పొందిన అస్త్రాలను ఆశ్రమంపై ప్రయోగించగా ఆశ్రమవాసులు కకావికలై ప్రాణభయంతో పరుగులు తీస్తారు. వశిష్ఠ మహర్షి దానిని గమనించి కుటీరం నుండి బయటకు వస్తాడు. విశ్వామిత్రుడు ఆ మహర్షిని చూసిన వెంటనే అగ్నేయాస్త్రాన్ని ప్రయోగిస్తాడు. అప్పుడు వశిష్ఠుడు తన బ్రహ్మదండమును అడ్డు పెడితే ఆ ఆగ్నేయాస్త్రం బ్రహ్మదండంలోకి చేరిపోతుంది. అది చూసిన విశ్వామిత్రుడికి కోపం వచ్చి తన దగ్గరున్న అస్త్రాలను వరసగా ప్రయోగిస్తాడు.

...ఇంకా ఉంది

*****

# కాశీ కథలు




కాశీ జీవుల పాపములను నాశనం చేస్తుంది.మనం జన్మించాము అంటే మనకు ఉన్న కర్మలను అనుభవించవలసినదే అని అర్థం. శరీరధారణ చేసిన ప్రతివాడు ఏదో ఒక రూపంలో ఎక్కడో ఒకచోట పాపం చేస్తాడు, అలానే పుణ్యం కూడా చేస్తాడు. కాయక,మానసిక, వాచిక పాపములను, పుణ్యములను తెలిసో తెలియకో జీవులు చేసి ఆ పాప/పుణ్య కర్మను అనుభవించడానికి మళ్లీ మళ్లీ జన్మను ఎత్తి జనన-మరణ చక్రబంధంలో ఇరుక్కుంటారు. పుణ్య కర్మల వలన కలిగే ఆనందానికి పొంగిపోకూడదు పాపకర్మల వలన అనుభవించే దుఃఖమునకు బాధపడకూడదు, కానీ తటస్థముగా ఉండి కర్మఫలం అనుభవించటం సామాన్యమైన విషయం కాదు. కలియుగ జీవులకు ఒక సులభోపాయమును భగవంతుడగు పరమేశ్వరుడు అందించాడు అదే కాశీ క్షేత్రము. కాశీ కాశీ కాశీ అని నిత్యం తలుచుకుంటూ కాశీ క్షేత్ర వైభవమును తెలుసుకొని ఎవరైతే ఆత్మానందము చెందుతాడో అతడు ఎంతటి బాధ అయినా అల్పంగానే భావిస్తాడు. బంగారు కిరీటము ధరించినా అది కేవలం పరమాత్ముడి లీల అని భావిస్తాడు. కాశీని తలుచుకున్న వారు ఎవరైనా నిస్సందేహంగా శివుడికి ప్రీతిపాత్రులే అవుతారు. ప్రతి జీవికి అనుభవించవలసిన ప్రారబ్ద కర్మ అంటూ ఒకటి ఉంటుంది కానీ కాశీ క్షేత్ర దర్శనం వల్ల కాశీస్మరణ వల్ల అనేక జన్మలలో చేసిన పాపములకు అనుభవించవలసిన ప్రారబ్దమును కూడా నశింపజేయగలిగిన క్షేత్రం కాశీపట్టణం. ఇటువంటి కాశీ క్షేత్రం గురించి పూజ్య గురుదేవులు వద్దిపర్తి పద్మాకర్ గురువుగారి అనుగ్రహంతో కాశీ కథలు అనే శీర్షిక ద్వారా తెలుసుకుందాం. గత సంచికలో సాంబాదిత్యుడి గురించి తెలుసుకున్నాము, ఆదిత్యుడు ఆరోగ్య ప్రదాత ఆయనను స్మరించినంత మాత్రము చేత ఆరోగ్యమును ప్రసాదిస్తాడు, సంపదలను అనుగ్రహిస్తాడు. ఈ సంచిక లో ద్రౌపదాదిత్యుడి గురించి తెలుసుకుందాం.

శివకార్యము పూర్తి చేయకుండా మందరాచలమునకు ఎలా వెళ్ళగలను?శివాజ్ఞ పూర్తి చేయకుండా వెళితే శివుడి ఆగ్రహమునకు గురికాక తప్పదు అని భావించాడు సూర్యుడు. ధర్మ స్వరూపమైన కాశీయందే నివశించాలని నిశ్చయమైన నిర్ణయము తీసుకున్నాడు. విశ్వములో అందరూ కాశీవాసం కోరుకుంటారు కానీ అందరికీ ఈ భాగ్యం దక్కదు కదా! కాశీవాసం వలన నా తేజస్సు మరింత పెరుగుతుంది తప్ప తరగదు అని సూర్యుడు భావించెను. శివుడు కరుణా సముద్రుడు. కాశీ వాసం వలన ఆయన అనుగ్రహం తప్పక పొందగలను అని నిర్ణయం తీసుకున్నాడు. ద్వాదశ రూపములతో కాశీలో ఉండిపోయాడు ప్రత్యక్ష దైవం అయిన సూర్యభగవానుడు.

లోలార్క ఆదిత్య , ఉత్తరార్క ఆదిత్య , సాంబాదిత్య, ద్రుపదాదిత్య, మయూఖాదిత్య, ఖఖోల్కాదిత్య, అరుణాదిత్య, వృద్ధాదిత్య, కేశవాదిత్య, విమలాదిత్య, గంగాదిత్య, యమాదిత్య. ఇలా పన్నెండు రూపములతో సూర్యుడు కాశీక్షేత్రం లో భక్తులను అనుగ్రహిస్తున్నాడు.

శ్లో॥ లోలార్క ఉత్తరార్కశ్చ సాంబాదిత్యస్తథైవచ।
చతుర్థాద్రుపదాదిత్యో మయూఖాదిత్య ఏవచ॥

శ్లో॥ ఖఖోల్కశ్చారుణాదిత్యో వృద్ధకేశవసంజ్ఞకౌ।
దశమో విమలాదిత్యో గంగాదిత్యస్తథైవ చ॥

శ్లో॥ ద్వాదశశ్చ యమాదిత్యః కాశీపూర్యాం ఘటోద్భవ।
తమోధికేభ్యోదుష్టేభ్యః క్షేత్రం రక్షన్త్యామీసదా॥

(స్కాం.పు, కా.ఖం, అధ్యా:46, శ్లో:45,46,47)

## ద్రౌపదాదిత్యుడు



సూతుడు కాశీ ఖండమును గురించి తెలుసుకుంటున్న క్రమములో వ్యాస మహర్షిని ఇలా అడిగెను "మహాత్మ కార్తికేయుడు అగస్త్యుడికి ఆదిత్య వృత్తాంతము చెబుతున్నప్పుడు ద్రౌపది ఎక్కడ ఉన్నది?అసలు ద్రౌపది పుట్టనే లేదు కదా?" అందుకు వ్యాసుడు ఇలా సమాధానం చెప్పెను "ఓ మహర్షి ! పురాణ, శాస్త్రములలో భూత, భవిష్యత్తు, వర్తమానముల యొక్క సారాంశములు కథలుగా ఉంటాయి.అందువలన నీవు ఈ విషయము పై సందేహము ఉంచనవసరము లేదు". అని తెలియజేసెను. ఈ విషయం మహర్షి సౌనకాదులకు ఆదిత్య వృత్తాంతమును వివరించే క్రమం లో చెప్పెను. శిష్ట రక్షణ కొఱకు, దుష్ట శిక్షణ కొఱకు పరమేశ్వరుడు పంచ పాండవుల రూపములో అవతరించారు.జగదంబిక ద్రుపదమహారాజు యజ్ఞ కుండము నుండి ఉత్పన్నమై ద్రౌపదిగా అవతరించి పాండవులకు పత్ని అయ్యెను. వాసుదేవుడు కృష్ణ పరమాత్మగా పాండవుల సహాయార్థం అవతరించెను.సుఖము తరువాత దుఃఖము,దుఃఖము తర్వాత సుఖమును అనుభవిస్తూ ధర్మమార్గములో పాండు పుత్రులు నడుచుచుండెరివారు. అనుకోని పరిస్థితి వలన పాండవులు వనవాసం చేయవలసి వచ్చెను. పాండు పుత్రులకు సహధర్మచారిణి అయిన ద్రౌపది తన భర్తల కొఱకు వారి క్షేమము కొఱకు సూర్యోపాసన చేసెను. సూర్యుడు ద్రౌపది ఆరాధనకు ప్రసన్నుడై ఒక అక్షయపాత్రను ఇచ్చెను. సూర్యుడు ద్రౌపదితో ఇలా పలికెను "ఓ సౌభాగ్యవతి ఏ రోజుకు ఆ రోజు నీవు భోజనం చేయనంతవరకు ఎంతమంది అన్నార్థులకైనా అన్నమును అనుగ్రహిస్తుంది అక్షయ పాత్ర, కోరినవి కోరినట్లుగా ఇస్తుంది,నీవు ఆ రోజు భోజనము చేసిన తరువాత ఈ అక్షయపాత్ర ఖాళీ అయిపోతుంది". సూర్యదేవుడు ద్రౌపదికి మరొక వరమును కూడా ఇచ్చెను. ద్రౌపది తో సూర్యుడు ఈ విధముగా చెప్పెను "విశ్వనాథ మందిరమునకు దక్షిణ దిశ వైపు నీవు స్థిరముగా ఉంటావు నీ సమక్షములో నా ఆరాధన జరుగుతుంది.ఇక్కడ నా ఆరాధన చేయు ప్రాణులకు ఎప్పటికీ ఆకలి వలన పీడుతులు

# ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు



కారు". అందువల్ల కాశీ లోని ద్వాదశ ఆదిత్యుల రూపములలోని ఒక రూపమునకు ద్రౌపదాదిత్యుడు అని పేరు వచ్చేను. సూర్యుడు మరల ఈ విధముగా ద్రౌపదితో ఇలా పలికెను- విశ్వనాథుడు ఒకప్పుడు నా తపస్సుకు సంతోషించి నాకు ప్రత్యక్షం అయ్యి ఇలా పలికెను "ఓ దివాకర ఏ వ్యక్తి అయితే నీకు పూజ చేసిన తరువాత నన్ను దర్శించుకుంటారో నువ్వు వారి యొక్క అన్ని దుఃఖములను దూరము చేయుదువుగాక!". ఈ విధంగా సూర్యుడికి శివుడు వరము ఇచ్చెను.ఓ ద్రౌపది నీకు వరమును ఇవ్వటానికి చెయ్యి ఎత్తిన నన్ను శ్రద్ధతో పూజించిన వారి కోరికలను నేను నెరవేర్చెదను, విశ్వేశ్వరునికి దక్షిణ భాగమున, దండపాణికి సమీపమున ఉన్న నిన్ను పూజించిన వారికి ఎప్పటికీ ప్రియ జనవినియోగము ఉండదు అని సూర్యుడు వరమును ఇచ్చెను. ఓ ద్రౌపది నీ దర్శన అనంతరము నన్ను దర్శించిన వారికి వ్యాధులు,ఆకలి దప్పులు వంటి కష్టములు ఎవరికి కలుగవు ఈ విధముగా ద్రౌపదికి వరములు ఇచ్చి సూర్యుడు విశ్వనాథుని ఆరాధనకు వెళ్లెను. ద్రౌపది వరములను పొంది పాండు పుత్రుల సన్నిధికి వెళ్లెను. ఈ కథను విన్నవారికి చదివిన వారికి చెప్పినవారికి అన్ని పాపములు నశించును.


...ఇంకా ఉంది


*****

## విద్యానిధి

శ్రీ ప్రణవ పీఠం విద్యానిధి శిక్షణా తరగతుల ఓరియంటేషన్ 22-4-2023 మరియు 23-4-2023 తేదీలలో జరిగింది. ఈ ఓరియంటేషన్లో 200 మంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది ఈ శిక్షణలో భాగంగా విద్యార్థులకు నేటి పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా మనోవికాసము మరియు నైపుణ్యత పెంచుకునే విధంగా అకాడమిక్ కోర్స్ విభాగాలు మరియు ఆధ్యాత్మికతకు సంబంధించిన విభాగాల గురించి తల్లిదండ్రులకు విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ శిక్షణలో అకాడమిక్ కోర్సులో భాగంగా ఫన్ Math, పబ్లిక్ స్పీకింగ్, జియోగ్రఫీ ఆర్ట్ విభాగాలు ఉన్నాయి స్పిరిచువల్ కోర్సులో సరస్వతి కవచము హనుమాన్ చాలీసా ఉన్నాయి ఈ శిక్షణలో ప్రతి విద్యార్థి అకాడమిక్ కోర్స్ నుండి ఒక సబ్జెక్టు స్పిరిచువల్ కోర్స్ నుండి ఒక సబ్జెక్టును ఎంచుకోవడం జరిగింది మే నెల మొదటి వారం నుండి ఈ శిక్షణా తరగతులు ప్రారంభం అగును.









ప్రణవ పద్మాకరం

శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక

ఏలూరు


# స్తోత్రమాలిక

## శ్రీ శివ కవచమ్

ఫలశ్రుతి :

శివకవచాన్ని పారాయణం చేసిన వారికి ఆరోగ్యం కలుగుతుంది. ఎటువంటి శారీరిక ఇబ్బందులు కలుగవు. అపమృత్యువు తొలగుతుంది. ముఖ్యంగా మనదేశసమ్రక్షణకు పారాయణం చేయడం మంచిది.

ఓం నమస్తే దేవేశాయ - సురాసురనమస్కృతాయ - భూతభవ్యమహాదేవాయ - హరితపింగళలోచనాయ - బలాయ - బుద్ధిరూపిణే — వైయాఘ్రవసనాచ్ఛాదాయ - అరుణాయ - త్రైలోక్యప్రభవే - ఈశ్వరాయ - హరాయ - హరితనేత్రాయ — యుగాంతకరణాయ - అనలాయ - గణేశాయ - లోకపాలాయ - మహాభుజాయ - మహాహస్తాయ - శూలినే - మహాదంష్ట్రిణే - కాలాయ - మహేశ్వరాయ - కాలరూపిణే - నీలగ్రీవాయ - మహోదరాయ - గణాధ్యక్షాయ - సర్వాత్మనే - సర్వభావనాయ - సర్వగాయ - మృత్యుహంత్రే - పారియాత్రసువ్రతాయ - బ్రహ్మచారిణే - వేదాంతగాయ - తపోంతగాయ - పశుపతయే - వ్యంగాయ - శూలపాణయే - వృషకేతనాయ - హరయే - జటినే - శిఖండినే - లకుటినే - మహాయశసే - భూతేశ్వరాయ - గుహావాసినే - వీణాపణవతాలవతే - అమరాయ - దర్శనీయాయ - బాలసూర్యనిభాయ - శ్మశానవాసినే - భగవతే - ఉమాపతయే - అరిందమాయ - భగస్యాక్షిపాతినే - పూష్ణదశననాశనాయ - క్రూరనికృంతనాయ - పాశహస్తాయ - ప్రళయకాలాయ - ఉల్కాముఖాయ - అగ్నికేతవే - మునయే - దీప్తాయ - నిశాంపతయే - ఉన్మత్తాయ - జనకాయ - చతుర్థకాయ - లోకసత్తమాయ - వామదేవాయ - వాగ్దాక్షిణ్యాయ - వామతోభిక్షవే - భిక్షురూపిణే - జటినే - స్వయంజటిలాయ - శక్రహస్తప్రతిస్తంభకాయ - క్రతవే - క్రతుకరాయ - కాలాయ - మేధావినే - మధుకరాయ - చలాయ - వాక్ సత్యాయ — వాజసనేతిసమాశ్రమపూజితాయ - జగద్ధాత్రే - జగత్కర్త్రే - పురుషాయ - శాశ్వతాయ - ధ్రువాయ - ధర్మాధ్యక్షాయ - త్రివర్త్మనే - భూతభావనాయ - త్రినేత్రాయ - బహురూపాయ - సూర్యాయుతసమప్రభాయ - దేవాయ - సర్వతూర్యనినాదినే - సర్వబాధావిమోచనాయ - బంధనాయ - సర్వధారిణే - ధర్మోత్తమాయ - పుష్పదంతాయ - అవిభాగాయ - ముఖ్యాయ - సర్వహరాయ - హిరణ్యశ్రవసే - ద్వారిణే - భీమాయ - భీమపరాక్రమాయ - ఓం నమో నమః

*****

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# గురుదేవుల జీవన కవనము

## పంచమోధ్యాయము



పట్టుదలతో కాశీకి ప్రయాణమైన బాల పద్మాకరుడు ఆహారము లేక సొమ్మసిల్లి నడక మార్గంలో క్రిందకు పడిపోయాడు. సరిగ్గా ఈ సమయంలోనే జరిగింది ఒక అద్భుత ఘట్టం, మహాపురుషులకు ప్రకృతి సహకరిస్తుంది అనేందుకు ఇది చిన్న ఉదాహరణ. బాలపద్మా కరుడిని అటువైపుగా తోపుడు బండితో వస్తున్న దంపతులు చూసి ముఖముపై నీరు చల్లి తేనే, నిమ్మకాయ కలిపిన నీటిని అందించారు. బాలపద్మాకరుడిని పలకరించి నువ్వు ఎవరు ?ఎక్కడికి వెళ్తున్నావు అని అడిగారు, బాలుడి ద్వారా కాశీ యాత్ర విషయం తెలుసుకున్న ఆ దంపతులు ఎంతో సంతోషించారు, చిరునవ్వు నవ్వుకున్నారు. దంపతులలోని భర్త బాలుడి తో ఇలా అన్నాడు "ఓ బాలపద్మాకరుడా! నీకు ఇప్పటికిప్పుడు కాశీకి వెళ్లే యోగము లేదు, అందుకు ఇంకా చాలా సమయం ఉన్నది,నీకు కాశీ గురించి కాశీఖండంలోని వృత్తాంతముల గురించి నీ తండ్రి గారు చెప్పారు అన్నావు కదా మరి కాశీఖండంలోనే ఆగస్త్యుడు శ్రీశైల మహిమను లోపాముద్రకు చెప్పిన విషయమును నీ తండ్రిగారు చెప్పలేదా?" అందుకు సమాధానంగా బాల పద్మాకరుడు చిన్నగా తల ఊపాడు. ఓ బాలకా నా మాట విను నీవు కూడా నా భార్య, పిల్లలతో పాటు శ్రీశైల దర్శనమునకు బయలుదేరు అని భర్త చెప్పెను. మేమందరము మొక్కు తీర్చుకొనుటకై శ్రీశైలమునకు బయలుదేరినాము అని చెప్పెను. అతని మాటలలో ఏమి ఉన్నదో ఏమో కానీ వెంటనే బాల పద్మాకరుడు శ్రీశైల యాత్ర చేయడానికి సిద్ధపడ్డాడు. ఇంతలో ఆ దంపతులలోని భార్య ఎప్పుడు తిన్నావో ఏమో! కాస్త అన్నం పెడతాను తిను నాయనా అని బాల పద్మాకరుడితో పలికింది. అందుకు బాల పద్మాకరుడు మా నాన్నగారు శివ భక్తులు వండిన అన్నం మాత్రమే తినాలి అని మాకు చెప్పారు అని అన్నాడు

....ఇంకా ఉంది

*****

"ఎప్పుడూ ఏకాదశినాడు స్నానం చేసేటప్పుడు సంకల్పం చెప్పుకుని స్నానము చెయ్యాలి. సంకల్పవిహీన స్నానము వలన రావలసినంత ఫలితము రాదు అని శాస్త్రము"

ప్రణవ పద్మాకరం
శ్రీ ప్రణవపీఠం వారి మాస పత్రిక
ఏలూరు

# శ్రీమహాలక్ష్మీ కటాక్షానికి బిల్వపత్రపూజ

పూర్వం దారిద్ర్యనాశనానికి, పోయిన సామ్రాజ్యం తిరిగి పొందడానికి ఇంద్రుడు శ్రీమహాలక్ష్మిని ఎనిమిది శ్లోకాలతో స్తుతించాడు. ఆ స్తోత్రానికి శ్రీమహాలక్ష్మి సంతుష్టురాలై అతనికి ప్రత్యక్షమైంది. అతనికి సకల వరాలూ ఇచ్చింది. ఆపై అతనితో ఇలా అన్నది. "దేవేంద్రా! నీవు చేసిన ఈ స్తోత్రం వేదసమ్మతమైన స్తోత్రం. ఇందులోని నామాలన్నీ మహామంత్రాలే. శ్రావణ శుక్ల పక్ష ద్వితీయ (విదియ) తిథి నుండి కాని, భాద్రపద పూర్ణిమ నుండి కాని, ఆశ్వయుజ ప్రతిపత్తిథి నుండి[పాడ్యమి] కాని, కార్తిక మాసంలో ఏదైనా ఒక సోమవారం నుండి కాని తక్కిన మాసాలలో శుక్రవారం నుండి కాని ఈ స్తోత్రంలోని ఒక్కొక్క నామాన్ని పలిస్తూ ౯ రోజులు విడిచిపెట్టకుండా [మధ్యలో ఏ రోజూ ఆపరాదు] నన్ను బిల్వపత్రాలతో పూజించినవారికి ఎటువంటి దరిద్ర స్థితినైనా తొలగించి, సర్వసంపదలూ ఇస్తాను. ముందుగా, గణపతిని, తరువాత గురువును ధ్యానించి, పూజామందిరంలో నా పటం లేక లోహ ప్రతిమ[బంగారం, వెండి, రాగి, ఇత్తడి రూపులని అర్థం] ఉంచి యథాశక్తి పూజించి, బిల్వపత్రాలతో [మారేడు ఆకులతో] పూజించాలి. పూజ మధ్యలో ఎట్టిపరిస్థితులలోనూ లేవరాదు. నైవేద్యం — ఆవుపాలు కాచి చల్లార్చి, పంచదార కలిపిన ఆవు పాలనే నివేదించాలి. ఆ పాలు కుటుంబ సభ్యులే త్రాగాలి. ఈ పూజ ఇహపరసుఖప్రదమైనది." ఇంద్రుడమ్మవారు ఆజ్ఞాపించినట్లుగా పూజించి స్వారాజ్యం పొందాడు. కాబట్టి నీవు కూడా అలాగే చేయి. నేను నీకు లక్ష్మీప్రతిమను ఇస్తాను. అష్టకస్తోత్రం ఉపదేశిస్తాను." ఇలా పలికి వేదవ్యాసమహర్షి — పింగళుడికి మహాలక్ష్మ్యష్టకాన్ని ఉపదేశించాడు.



## శ్రీమహాలక్ష్మ్యష్టక స్తోత్రమ్

1. నమస్తే స్తు మహామాయే, శ్రీపీఠే సురపూజితే
   శంఖచక్ర గదాహస్తే! మహాలక్ష్మి! నమోఽస్తుతే
2. నమస్తే గరుడారూఢే! డోలాసుర భయంకరి
   సర్వపాపహరే దేవి! మహాలక్ష్మి! నమోఽస్తుతే
3. సర్వజ్ఞే! సర్వవరదే! సర్వదుష్టభయంకరి
   సర్వదుఃఖహరే! దేవి! మహాలక్ష్మి! నమోఽస్తుతే
4. సిద్ధి బుద్ధిప్రదే! దేవి! భుక్తి ముక్తి ప్రదాయిని
   మంత్రమూర్తే! సదాదేవి! మహాలక్ష్మి! నమోఽస్తుతే
5. ఆద్యంత రహితే! దేవి! ఆదిశక్తి! మహేశ్వరి
   యోగజ్ఞే! యోగసంభూతే! మహాలక్ష్మి! నమోఽస్తుతే
6. స్థూల సూక్ష్మే! మహారౌద్రి! మహాశక్తే! మహోదరే
   మహాపాపహరే! దేవి! మహాలక్ష్మి! నమోఽస్తుతే
7. పద్మాసన స్థితే! దేవి! పరబ్రహ్మ స్వరూపిణి
   పరమేశి! జగన్మాతః! మహాలక్ష్మి! నమోఽస్తుతే
8. శ్వేతాంబరధరే! దేవి! నానాలంకార భూషితే
   జగత్ స్థితే! జగన్మాతః! మహాలక్ష్మి! నమోఽస్తుతే

ఈ స్తోత్రం మూడు పూటలా చదువుతూ మారేడు దళాలతో శ్రీమహాలక్ష్మిని పూజించు," అని వేదవ్యాసుడు ఆజ్ఞాపించగా పింగళుడు భక్తితో ఆయన చెప్పినట్లుగానే శ్రీమహాలక్ష్మిని పూజించాడు. లక్ష్మీదేవి ప్రత్యక్షమయ్యింది. అతని దారిద్ర్యం తొలగించింది. సకల సంపదలూ ఇచ్చింది. బిల్వపత్ర పూజా ప్రభావం ఇటువంటిది అని చెప్పి అంతర్హితురాలయ్యింది. ఒక్కొక్కప్పుడు మారేడాకులు దొరకకపోతే ఏం చేయాలో కూడా వేదవ్యాసుల వారు చెప్పారు. వెండి లేక బంగారంతో 108 బిల్వపత్రాలు తయారు చేయించుకొని వాటితో పూజించవచ్చు. వాటిని ఏ రోజుకారోజు కడిగి మరునాడు పూజకు వాడుకోవచ్చును. ఇది ఆపద్ధర్మం. నిజానికి చెట్టునుండి కోసిన సహజ బిల్వపత్రాలే పూజకు శ్రేష్ఠాలు. శ్రీసూక్తం పఠిస్తూ మహాలక్ష్మీరూపాన్ని ఆవుపాలతో అభిషేకించి, ఆ తరవాత దానిని శుభ్రపరచి, తామరపూలు బిల్వపత్రాలూ రెండింటితో పూజిస్తే ఋణవిముక్తి అవుతుంది. సర్వ సంపదలూ లభిస్తాయి. అభిషేకం చేసిన పాలను తీర్థంగా పూజా సమాప్తి అయ్యాక తీసుకోవాలి. ఇలా మండలం రోజులు(40) విడవకుండా పూజిస్తే కలిగే శుభఫలితాలు అనంతాలు. పూజా ప్రారంభంలో గురువును మాత్రం తప్పక ధ్యానించాలి. ఈ విధానాలు తెలుసుకొని పూజించి లక్ష్మీ కటాక్షాన్ని పొందండి.

*****

## గురుదేవుల విజయ యాత్ర



పూజ్య గురుదేవులు ఏప్రిల్ నెలలో చేపట్టిన అమెరికా యాత్ర దిగ్విజయంగా జరుగుతోంది. అమెరికా లోని అనేక నగరములలో పర్యటించి హిందువులకు ధర్మోపదేశము చేసారు.గురుదేవులను దర్శించుకొని భక్తులు పూజ్య గురుదేవుల అనుగ్రహం పొందారు.

ATA ఆధ్వర్యంలో తొలిసారి USA లో గురుదేవులు శతావధానము చేసారు

*****

## హనుమాన్ చాలీస పారాయణ



పూజ్య గురుదేవుల దయతో టెలిగ్రామ్ గ్రూప్ కాల్ ద్వారా ప్రతి రోజు శ్రీమతి V .పద్మావతి గారి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీస దివ్య పారాయణ కార్యక్రమం ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుండి జరుగుతుంది. ప్రతి మంగళవారం, శనివారం 108 సార్లు హనుమాన్ చాలీస పారాయణ జరుగుతున్నది.

*****

## గుడి-బడి

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు ఇచ్చిన పిలుపుతో గురు భక్తులు అందరూ భక్తి తో గుడి-బడి కార్యక్రమం లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమములో భాగముగా భక్తులు వారి ఊరిలోని ఒక మందిరమును శుభ్రపరచి, సంకీర్తనలు పాడి, నామ స్మరణ చేసుకొని సాధ్యమైన మేరకు అన్న దాన కార్యక్రమములు యథా శక్తిగా నిర్వహించడం జరిగింది. హైదరాబాద్, విశాఖపట్టణం, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూల్, కడప వంటి అనేక నగరములతో పాటు అనేక గ్రామములలో కూడా ఈ కార్యక్రములను గురుభక్తులు నిర్వహించడం జరిగింది. ప్రముఖ దిన పత్రికలలో కూడా గుడి-బడి కార్యక్రమ వివరాలను అందించారు.

